ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

జయశంకర్ భూపాలపల్లి
బుధవారం 5 నవంబరు 2025

సంపత్తి దోపిడీ!



- రైతుల అవసరాలను ఆసరా చేసుకుంటున్న దళారులు
- గుట్టుచప్పుడు కాకుండా పత్తి కొనుగోలు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- ఇంకా ప్రారంభం కాని సీసీఐ కేంద్రాలు

ములుగు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పడించిన పంటలు దళారుల పాలవుతున్నాయి. రైతుల అవసరాలను ఆసరా చేసుకొని ప్రైవేటు వ్యాపారులు తక్కువ ధరకే పత్తిని కొనుగోలు చేసి దోపిడీ చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఇది జరుగుతున్నా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాల్సిన అధికారులు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

జిల్లా 25,852 ఎకరాల్లో పత్తి సాగు

ములుగు జిల్లాలోని పది మండలాల్లో 14,715 మంది రైతులు 25,852.38 ఎకరాల్లో పత్తి పంట సాగు చేసినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొన్నారు. ఏటూరునాగారం మండలంలో 100 మంది రైతులు 265.32 ఎకరాల్లో పత్తి సాగు చేశారని, గోవిందరావుపేట మండలంలో 199 మంది 360.25 ఎకరాల్లో, కన్నాయిగూడెం మండలంలో 124 మంది 304.01 ఎకరాల్లో, మంగపేట మండలంలో 291 మంది 801 ఎకాల్లో, తాడ్వాయి మండలంలో 1047 మంది 2,544.11 ఎకరాల్లో, వెంకటాపురం మండలంలో 96 మంది 183.06 ఎకరాల్లో, వాజేడు మండలంలో 12 మంది 12.37 ఎకరాల్లో, జేడీ మల్లంపల్లి మండలంలో 2,708 మంది 3,693.25 ఎకరాల్లో, వెంకటాపూర్ మండలంలో 3,328 మంది 5,867.11 ఎకరాల్లో, ములుగు మండంలో 6,810 మంది 11,820 ఎకరాల్లో సాగు చేసినట్లు వివరించారు. ఇందులో 2,06,819 క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చి ఉంటుందని అధికారులు అంచనా వేశారు.

సీసీఐ కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం

పత్తిని అమ్ముకునేందుకు ప్రభుత్వం కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. వాటిని అక్టోబరులోనే ప్రారంభించాల్సి ఉండగా ఇప్పటి వరకూ ఇది జరగలేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యేందుకు మరికొన్ని రోజులు పట్టే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఒక వైపు వర్షాలు, మరో వైపు సీసీఐ కొనుగోళ్లలో జాప్యంతో చేసేదేమీ లేక దళారులకే అమ్మేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. ఇదే అదునుగా భావించిన దళారులు గ్రామాల్లో తమ ఏజెంట్ల ద్వారా పత్తి కొనుగోళ్లు చేస్తూ రైతులను నిండా ముంచుతున్నారు.

పత్తికి మద్దతు ధర ఇలా..


పత్తికి గిట్టుబాటు ధరను కల్పిస్తూ ప్రభుత్వం సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. దీనికి తోడు నాణ్యతా ప్రామాణాలను కూడా పరీక్షిస్తోంది. నిబంధనలకు లోబడి పత్తి ఉంటే మద్దతు ధర కల్పిస్తూ కొనుగోలు చేస్తుంది. బీబీమోడ్ పింజ రకం 29.5 నుంచి 30.50 మీ.మీలు పొడవున్న పత్తికి 8శాతం తేమ ఉంటే రూ. 8,110, తొమ్మిది శాతం తేమ ఉంటే రూ. 8,028, పది శాతం ఉంటే రూ. 7,947.80, పదకొండు శాతం తేమ ఉంటే రూ. 7,866.70, పన్నెండు శాతం తేమ ఉంటే రూ. 7,785.60 చెల్లించనున్నారు. అలాగే బీబీ ఎస్పీఎల్ 29.01-29.49 మీమీ పొడవున్న పింజ రకానికి బీబీ మోడ్ కంటే రూ. 50 తక్కువగా చెల్లిస్తారు. అదేవిదంగా ఎంతఈసీహెచ్ 27.50-28.50 మీమీల పొడవున్న పింజ రకానికి బీబీ మోడ్ రకం కంటే రూ.100 తక్కువ ధర ఇస్తారు.

గుట్టు చప్పుడు కాకుండా కొనుగోళ్లు

ములుగు జిల్లా వ్యాప్తంగా దళారులు గుట్టు చప్పుడు కాకుండా పత్తిని కొనుగోలు చేస్తున్నారని తెలుస్తోంది. ఊరికో ఏజెంటును ఏర్పాటు చేసుకుని తమ వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించారని సమాచారం. క్వింటాకు రూ.5,500 నుంచి రూ.6వేల వరకు చెల్లిస్తూ రైతులను నిండా ముంచుతున్నారు. ఒక వైపు అకాల వర్షం, మరో వైపు తమ ఆర్థిక అవసరాలు రైతులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. దీనికి తోడు అధికారులు ఇంకా సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించక పోవడంతో చేసేదేమీ లేక దళారులకే పత్తిని విక్రయిస్తున్నారు. ఒక వేళా కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనప్పటికీ

దళారులకు కలిసిరానున్న కపాస్ కిసాన్ యాప్

రైతులకు సరైన గిట్టుబాటు ధరను కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కపాస్ కిసాన్ యాప్ దళా రులకు



(మిగతా 6వ పేజీలో)

నిర్లక్ష్యం చేస్తే జీతాలు కట్

- వైద్య సిబ్బందికి కలెక్టర్ హెచ్చరిక
- ప్రభుత్వ ఆస్పత్రి ఆకస్మిక తనిఖీ



ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లిటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని, అవసరమైతే వేతనాల్లో కోత విధిస్తామని కలెక్టర్ రాహుల్ శర్మ వైద్య సిబ్బందిని హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు వార్డులను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. మరుగుదొడ్ల నిర్వహణ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ఆహారం పరిశీలించి నాణ్యతగా వండి పెట్టాలని, లేదంటే చర్యలు తీసుకుంటామని అన్నారు. మెస్పైలో స్పష్టత ఉండాలన్నారు. వైద్య సేవలపై ఫిర్యాదులు చేసేందుకు ప్రత్యేక బాక్స్‌లు ఆస్పత్రిలో ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. రక్షణ చర్యల్లో భాగంగా ఫైర్ ఎస్టింగ్విషర్ల గడువు ముగిసినప్పటికీ మళ్లీ ధ్రువీకరణ ఎందుకు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. రోజుకు వెయ్యికి పైగా రోగులు వస్తున్నారని కలెక్టర్‌కు ఆస్పత్రి పర్యవేక్షకుడు రాజేంద్రప్రసాద్ తెలిపారు. వీరిలో సాధారణ ప్రసవాలు, సిజేరియన్‌ల వివరాలు, ప్రమాదకర కేసులను గురించి వివరించారు. ప్రమాదకర, సిజేరియన్ కేసులను ఎక్కడికి రెఫర్ చేస్తున్నారని కలెక్టర్ ఆరా తీశారు. లీకేజీల కారణంగా ఆక్సిజన్ ప్లాంటు ఆగిపోయిందని గుర్తించిన కలెక్టర్ దానిని వెంటనే సరిచేయించాలని సూచించారు. ఆయన వెంట ఆర్ఎంవో దివ్య, అన్ని విభాగాల వైద్యులు తదితరులు ఉన్నారు.

కాళేశ్వరం అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

కాళేశ్వరం అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఐడీవోసీ కార్యాలయంలో రెవెన్యూ, పంచాయతీరాజ్, కాటారం సబ్ కలెక్టర్, విద్యుత్, ఈవో కాళేశ్వరం, డీపీవో, సీపీవో, ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, దేవాదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లతో ఆయన టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. కాళేశ్వరం అభివృద్ధి పనుల్లో అమలు వేగాన్ని పెంచాలని సూచించారు. నాణ్యత పర్యవేక్షణలో ఎక్కడా రాజీ పడొద్దని ఆదేశించారు. పెండింగ్ పనులను సమయానికి పూర్తి చేసి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు తాజా అప్‌డేట్లతో ప్రగతి నివేదికలు, అవసరాలు, పెండింగ్ సమస్యలు, అలాగే ఫీల్డ్ పనులకు సంబంధించిన ఫొటో డాక్యుమెంటేషన్ అందించాలన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, దేవాదాయ శాఖ, పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ బంగారం అంటగట్టి మోసం

- రూ. 10 లక్షలతో ఉడాయించిన ముఠా
- కాటారంలో లబోదిబోమంటున్న కిరాణా షాపు యజమాని

వివరాలు 5వ పేజీలో..

ఉరేసుకొని స్టాఫ్ నర్సు ఆత్మహత్య



అనిత (ఫైల్)

కృష్ణకాలనీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉరేసుకొని స్టాఫ్ నర్సు ఆత్మహత్య చేసుకున్న సంఘటన భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మంజూర్‌నగర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా తాడ్వాయి మండలం రంగాపూర్ గ్రామ పంచాయతీ పరిధి కొత్తపల్లి గ్రామానికి చెందిన ఇరుప లక్ష్మయ్య కుమార్తె అనిత (30) భూపాలపల్లిలోని ప్రభుత్వ వంద పడకల ఆస్పత్రిలో స్టాఫ్‌నర్సుగా పని చేస్తోంది. అనారోగ్యం కారణంగా వారం క్రితం ఇంటికి వెళ్లిన ఆమె ఈనెల 3న భూపాలపల్లికి తన తమ్ముడు సుమన్‌తో కలిసి తిరిగి వచ్చింది. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఇద్దరు కలిసి భోజనం చేశా రు. వారుంటున్న కిరాయి ఇంట్లోని వెనక గదిలో సుమన్ నిద్రకు ఉపక్రమిం చాడు. మంగళవారం తెల్లవారుజామున అతడు లేచి చూడగా గదికి గడియ పెట్టి ఉంది. ఎంతకూ తలుపులు తీయకపోవడంతో వాటిని పగలగొట్టి బయ టకు వచ్చి చూసేసరికి అనిత కిటికీకి ఉరేసుకొని ఉంది. వెంటనే చుట్టుపక్కల వారిని పిలిచి వేలాడుతున్న ఆమెను కిందకు దింపారు. అప్పటికే అనిత మృతి చెందింది. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం వంద పడకల ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తండ్రి లక్ష్మయ్య ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యా ప్తు చేస్తున్నట్లు సీఐ నరేష్‌కుమార్ వెల్లడించారు. మృతురాలు అవివాహితు రాలు. తన చెల్లికి అనిత వివాహం జరిపించగా ఇప్పటికీ తల్లిదండ్రుల బాగో గులన్నీ ఆమెనే చూసుకుంటోందని కుటుంబ సభ్యులు తెలిపారు.

డోజర్ ఢీకొని సైట్ ఇంజనీర్ మృతి

బుర్రకాయలగూడెం సమీపంలో ఘటన



సర్వ రాకేష్ మృతదేహం

గణపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రోడ్డు మరమ్మతు పనులు చేపడుతున్న క్రమంలో డోజర్ ఢీకొని సైట్ ఇంజనీర్ మృతి చెందిన సంఘటన భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని కేశాపూర్ గ్రామానికి చెందిన సర్వ రాకేష్ (32) గణపురం మం డలంలోని గాంధీనగర్‌లో ఉన్న డాంబర్ ప్లాంట్‌లో సైట్ ఇంజనీర్ (ప్రైవేట్ ఉద్యోగి)గా విధులు నిర్వర్తిస్తున్నాడు. గాంధీనగర్-గణపురం కేంద్రానికి మధ్యలో రహదారి ప్యాచ్ వర్క్‌ను ఈ డాంబర్ ప్లాంట్ కాంట్రాక్టరే పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం రాకేష్ రోడ్డు కొలతలు తీస్తుండగా వెనకాలే చదును చేస్తూ వచ్చిన డోజర్ ప్రమాదవశాత్తు ఢీకొంది. దీంతో రాకేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని వెంటనే భూపాలపల్లిలోని వంద పడకల ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గ మధ్యలో రాకేష్ మృతి చెందాడు. మృతుడికి భార్య సుమలత, కుమారుడు నందు ఉన్నారు.

బీజేపీ నేతపై కేసు నమోదు

కృష్ణకాలనీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాటారం ప్రాంతానికి చెందిన బీజేపీ నేత చల్ల నారాయణరెడ్డిపై కేసు నమోదు చేసి నట్లు భూపాలపల్లి సీఐ నరేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 28న భూపాలపల్లి కోర్టు పరిసరా ల్లో తనను పరుష పదజాలంతో తిట్టడమే కాకుండా చంపుతానని నారాయణరెడ్డి బెది రించారని న్యాయవాది మీర్జా ఎజాజ్ అలీ బేగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమో దుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐతెలిపారు.

వైభవంగా వెంకన్న కల్యాణం

ప్రారంభమైన బుగులోని బ్రహ్మోత్సవాలు



స్వామివారిని ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు

రేగొండ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిరుమలగిరి శివారులో ఉన్న బుగులోని వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. జాతర చైర్మన్ రమణారెడ్డి, ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో తొలిరోజు స్వామి వారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. పద్మావతి సమేతంగా స్వామి వారి ఉత్సవమూర్తులను అలంకరించి రథంపై ఊరేగించారు. తిరుమలగిరి నుంచి బుగులోని గుట్ట వరకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా భక్తులు, గ్రామస్థులు భక్తిగీతాలు ఆలపిస్తూ, మహిళలు కోలాటాలతో నృత్యాలు చేస్తూ ముందుకు సాగారు. అడుగడుగునా మహిళలు మంగళహారతులు పడుతూ, కొబ్బరికాయలు కొడుతూ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గోవింద నామస్మరణం మార్మోగిపోయింది.

నూతనంగా నిర్మించిన మండపంలో పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి కల్యాణాన్ని వేదపండితులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వస్వామి, పద్మావతి అమ్మవార్లకు పట్టు వస్త్రాలతో అలంకరించి మండపంలోకి తీసుకొచ్చారు. అనంతరం మగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణాల మధ్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళసూత్రధారణ వేడుకను భక్తులు ఆసక్తిగా తిలకించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి స్వామివారిని గుట్ట పైకి చేర్చి హారతులు ఇచ్చి పుష్పార్చన చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ కర్ణాకర్‌రావు, ఎస్సై రాజేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవంలో తాళిని చూపిస్తున్న అర్చకులు

కలెక్టరేట్ వద్ద బీసీ సంఘాల ధర్నా

42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న బీసీ జేఏసీ నాయకులు

భూపాలపల్లిటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద మంగళవారం ధర్నా చేశారు. కలెక్టర్ రాహుల్ శర్మకు వినతిపత్రం అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ బీసీలకు న్యాయబద్ధంగా రిజర్వేషన్లు అమలు చేసే బాధ్యత కేంద్ర ప్రభుత్వమే తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇందుకు పార్లమెంటులో చట్టం చేయాలని అన్నారు. బీసీ సబ్ ప్లాన్ నిధులు రూ.40 కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ చైర్మన్ పైడిపల్లి రమేష్, యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల సంపత్, బీసీ జేఏసీ కోకన్వీనర్ బర్ల గట్టయ్య, జిల్లా కోఆర్డినేటర్ కొత్తూరి రవీందర్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంఘాల నాయకులు జోగు బుచ్చయ్య, ఇస్తారి, చేపూరి ఓదెలు, బీటీ చారి, భాస్కరాచారి, వెంకటస్వామి, తాటి వెంకన్న, మేకల రజిత, పద్మావతి, శంకర్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ వ్రతాలు



సామూహిక సత్యనారాయణ వ్రతాలు చేసుకుంటున్న భక్తులు

కాటారం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మేడిపల్లి అటవీ ప్రాంతంలోని ఉసిరిక వనంలో మండల కేంద్రంలోని శ్రీపాద కాలనీ, రెడ్డికాలనీలకు చెందిన పలువురు గురువారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు, కార్తీక వనభోజనాలు నిర్వహించారు. కార్తీకమాసం సందర్భంగా పలువురు కుటుంబ సమేతంగా ఉసిరిక వనానికి వెళ్లి దీపారాధన నిర్వహించారు. అనంతరం వనభోజనాలు చేశారు. ఉసిరిక వనంలో వేదపండితులు కృష్ణమోహన్‌శర్మ గణేష్‌శర్మ ప్రజలతో దీపారాధన, ధాత్రినారాయణ పూజలు వైభవంగా చేయించారు. ఈ కార్యక్రమంలో చల్ల జక్కిరెడ్డి, కామిడి శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజబాపు, సురేష్‌రెడ్డి, గడ్డె సమ్మిరెడ్డి, రామకృష్ణారావు, తిరుపతిరెడ్డి, చిన్నసమ్మిరెడ్డి, జలమయ్య, చీర్ల రాజబాపు, హరిప్రసాద్, పూర్ణచందర్‌రావు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి రమేష్‌బాబు



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి రమేష్‌బాబు

కృష్ణకాలనీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈనెల 15న నిర్వహించే ప్రత్యేక లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.హెచ్. రమేష్‌బాబు కోరారు. కోర్టు ప్రాంగణంలో ఆయన పోలీసు అధికారులతో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రిమినల్, సివిల్, వివాహ/కుటుంబ తగాదా కేసులు, మోటర్ వెహికిల్ యాక్టు కేసులు, బ్యాంక్, చిట్‌ఫండ్, ఎక్సైజ్ కేసులు, ఎలక్ట్రిసిటీ ఇతరత్రా కేసులు రాజీ పడేందుకు అవకాశం ఉందన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకునేలా పోలీసు అధికారులు ప్రచారం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి ఎ. నాగరాజ్, జూనియర్ సివిల్ జడ్జి దిలీప్‌కుమార్ నాయక్, అడిషనల్ జూనియర్ జడ్జి అఖిల, అదనపు ఎస్పీ నరేష్‌కుమార్, డీఎస్పీలు సంపత్‌రావు, సూర్యనారాయణ, సీఐలు పెద్దన్నకుమార్, నరేష్‌కుమార్, మల్లేష్ యాదవ్, నాగార్జునరావుతో పాటు జిల్లా పరిధిలోని ఎస్సైలు పాల్గొన్నారు.

గృహ సిలిండర్ల మాయాజాలం

- గ్యాస్ ఏజెన్సీల కక్కుర్తి
- వ్యాపార సంస్థలకు అక్రమంగా తరలింపు...
- బడా హోటళ్ల నుంచి చిరు వ్యాపారాల వరకు ఇష్టారాజ్యంగా వాడకం
- తనిఖీలే చేపట్టని అధికారులు

5లో..



ప్రణాళికతో అభివృద్ధి పనులను చేపట్టాలి: ఆర్డీవో



మునిసిపాలిటీ అభివృద్ధి పనులపై సమీక్షిస్తున్న ఆర్డీవో వెంకన్న

స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్పష్టమైన ప్రణాళికతో మునిసిపాలిటీ అభివృద్ధి పనులను చేపట్టాలని ఆర్డీవో వెంకన్న సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం స్టేషన్‌ఘన్‌పూర్ మండల కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో స్టేషన్‌ఘన్‌పూర్ మునిసిపాలిటీకి ఇటీవల మంజూరైన రూ .50కోట్ల నిధులతో చేపట్టే పనులపై మునిసిపల్ కమిషనర్ రాధాకృష్ణతో కలిసి సమీ క్షించారు. సమావేశంలో ఆర్డీవో మాట్లాడుతూ వార్డుల వారీగా వచ్చిన పనుల వివరాల పైన ఆరా తీశారు. పనుల జాప్యం కాకుండా ఎప్పటికప్పుడు నిర్వహించేలా చూడాలన్నారు. ప్రతీ పనికి సంబంధించిన వివరాలు ఉండాలని, పనుల్లో నాణ్యత కొరవ డితే తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తాగునీటి సరఫరాలో ఇబ్బంది లు రాకుండా మరింత మెరుగ్గా అందించేలా, పైపులైన్లు ఏర్పాటు చేసేలా చర్యలు ఉండాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, మునిసిప ల్ డీఈ ముజామిల్, ఏఈ వంశీకృష్ణ, మిషన్ భగీరథ డీఈ కరుణ్‌కుమార్, ఏఈ శ్రీనివాస్, సీనియర్ అకౌంటెంట్ నితిన్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన



బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

భూపాలపల్లి టౌన్, నవంబరు 4 (ఆంధ్ర జ్యోతి): బాల్య వివాహాల నిర్మూలనపై కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం జిల్లా శిశు సంక్షేమాధికారి మల్లీశ్వరి ఆదేశాల మేరకు భూపాలపల్లి పట్టణంలోని జంగేడులో గల కస్తూర్బా గాంధీ విద్యాలయంలో డీహెచ్‌డబ్ల్యూ, సీహెచ్‌ఎల్, సఖీ నిర్వాహకుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బేటి బచావో, బేటీ పడావో అనే నినాదంతో కేంద్ర ప్రభుత్వం బాలికల సంక్షరణకు అనేక కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు. ఈ క్రమంలో బాల కార్మికులుగా ఎవరూ మారవద్దని, బాల్య వివాహాలు అసలే జరగవద్దని తెలిపారు.బాలిక లకు రక్షణ, బాలల హక్కులు, సోషల్ మీడియా తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీహెచ్‌ఈడబ్ల్యూ అనూష, చైల్డ్ హెల్ప్ లైన్ కళావతి, సాయిరాం, సఖి నిర్వాహకురాలు మాధవి, కేజీబీవీ ఎస్‌వో ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ట్రైనీ కలెక్టర్ల పర్యటనకు సహకరించండి

అధికారులతో కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లిటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ట్రైనీ కలెక్టర్ల పర్యటనకు అన్ని శాఖల అధికారులు సహకరించాలని కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. ఐడీవోసీ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో ఆయన మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలు, పరిపాలనా విధానాలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోభివృద్ధిపై, అమలు తీరుతెన్నులను పరిశీలించడానికి ట్రైనీ కలెక్టర్లు జిల్లాలో పర్యటించనున్నారని తెలిపారు. ఈ క్రమంలో విద్య, వైద్య, అంగన్‌వాడీ కేంద్రాలు, స్వయం సహాయక సంఘాల నిర్వహణ, నర్సరీలు, డంపింగ్ యార్డులు, మిషన్‌భగీరథ తదితర సంక్షేమ కార్యక్రమాల అమలుపై వివరాలు అందించేందుకు సంబంధిత అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని సూచించారు.

పలిమెల మండలం లెంకలగడ్డ, మహాముత్తారం మండలం ములుగుపల్లిలో పంచాయతీలను పరిశీలించనున్నారని తెలిపారు. అవే గ్రామాల్లో వారు బస చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో వారికి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించాలని చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్, డీఈవో రాజేందర్, మిషన్‌భగీరథ ఈఈ శ్వేత, ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సీడీపీవోలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

ఈవీఎం గోదాము తనిఖీ

వీవీ ప్యాట్, ఈవీఎం గోదామును కలెక్టర్ రాహుల్‌శర్మ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాముకు వేసిన తాళం సీల్‌ను పరిశీలించారు. అనంతరం బందోబస్తు, తనిఖీ రిజిష్టర్‌లో సంతకాలు చేశారు. గోదాము వద్ద ఎలాంటి లోపాలు లేకుండా పటిష్ట భద్రత ఉండాలని సూచించారు. పర్యవేక్షణ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు అబ్బాస్, సిబ్బంది నవీన్ తదితరులు ఉన్నారు.

బీసీ రిజర్వేషన్ల అమలులో ప్రభుత్వం అభాసుపాలు

మాజీ ఎమ్మెల్యే రాజయ్య



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లు 42శాతం అమలు విషయంలో నకిలీ జీవోను తీసుకువచ్చి ప్రభుత్వం అభాసుపాలైందని మాజీ ఎమ్మెల్యే రాజయ్య ఆరోపించారు. మంగళవారం ఇప్పగూడెంలో నేలవాలిన పంటలను, ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని, భారీ వర్షాలకు తెగిపోయిన తెట్టెకుంటను పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. భారీ వర్షాలతో నియోజకవర్గం వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసి రైతులు పంటలు దెబ్బతిని ఇబ్బందులు పడుతుంటే ఎమ్మెల్యే శ్రీహరి రైతులను పరామర్శించకుండా నియోజకవర్గ కేంద్రంలో వంద పడకల ఆస్పత్రి, రెవెన్యూ డివిజినల్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను పరిశీలించడం సిగ్గుచేటు అన్నారు. ఓ ప్రక్క రైతులు అరిగోస పడుతుంటే ఓ ఎమ్మెల్యేగా వారిని పట్టించుకోకుండా కాంట్రాక్టర్లను భయభ్రాంతులకు గురి చేయడానికి నిర్మాణ పనులను పరిశీలిస్తున్నారన్నారు.

పూర్తిగా దెబ్బతిన్న పంటకు ఎకరానికి ఎకరానికి రూ.70 వేలు, పాక్షికంగా దెబ్బతింటే రూ.40 వేలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పగూడెం గ్రామంలో కడియం అనుచరులు తెట్టెకుంట భూమిని కబ్జా చేసి కట్టను తొలగించడం వల్లనే కట్టతెగిపోయిందని ఆరోపించారు. ఇరిగేషన్ అధికారుల అవగాహన రాహిత్యం వలన ధర్మసాగర్ రిజర్వాయర్ 8గేట్లు ఒకేసారి ఎత్తడంతో ఎకరాల కొద్ది భూమి ముంపునకు గురై, రైతుల పంట పొలాల్లో ఇసుక మేటలు వేశాయన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మారపాక రవి, పార్టీ మండలాధ్యక్షుడు మాచర్ల గణేస్‌గౌడ్, పట్టణాధ్యక్షుడు కనకం గణేష్, ఆకుల కుమార్, మహేందర్ రెడ్డి, పొన్నం లక్ష్మణమూర్తి, తాటికొండ సురేష్, పార్శి రంగన్న, గుర్రం ఏసుబాబు, పెసరు సారయ్య, గుర్రం శంకర్ పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో బహు ప్రయోజనాలు

ఉద్యాన శాఖ జిల్లా అధికారి సంజీవరావు

ములుగు టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ సాగుతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని ఉద్యాన శాఖ ఉన్నత అధికారి సంజీవరావు అన్నారు. జిల్లాలోని నర్సాపూర్, తాడ్వాయి, నార్లాపూర్, పత్తిపల్లి, మల్లంపల్లి, రామచంద్రాపూర్ గ్రామాల రైతు వేదికల్లో ఉద్యాన, వ్యవసాయ, సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులతో మంగళవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 2లక్షల 70వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగులో ఉందన్నారు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగును 2022-23 సంవత్సరంలో 843 ఎకరాలు చేపట్టినట్టు తెలిపారు. 2023-24లో 897 ఎకరాలు సాగు చేయగా, 2024-25లో 909 ఎకరాల్లో చేపట్టినట్టు వివరించారు. ఈ సంవత్సరం 3000 ఎకరాల సాగు లక్ష్యం కాగా ప్రస్తుతం 623 ఎకరాల్లో మొక్కలు నాటినట్టు తెలిపారు. 2022-23లో నాటిన మొక్కలకు దిగుబడి మొదలైందని, గెలలను కోర్ బయోసైన్స్ కంపెనీ వారు కొనుగోలు చేసి రైతు అకౌంట్‌లో డబ్బులను జమ చేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం గెల ధర టన్నకు రూ. 19,681 ఉందని అన్నారు. ఆయిల్ పామ్ సాగుతో స్థిరమైన నికర ఆదాయం ఇచ్చే దీర్ఘకాలిక పంట అని, ఈ మొక్కలను ఒక సారి నాటితే 30-35 సంవత్సరాల వరకు దిగుబడులను పొందొచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జిల్లా అధికారి సురేష్, ఏవోలు వినయ్, శ్రీధర్, ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ రామకృష్ణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపు నిర్వాహకుడిని బెదిరించి..

రూ.20వేలు, బంగారం దోపిడీ

కాటారం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని మద్దులపల్లి సమీపంలో 353(సీ) జాతీయ రహదారి పక్కన కిరాణాషాపుతో పాటు బెల్ట్ షాపు నడుపుకుంటున్న వ్యక్తిని నలుగురు దుండగులు బెదిరించి నగదు, బంగారం దోపిడీ చేసిన సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్న కిరాణా షాపు పెట్టుకున్న తిరుపతి అందులోనే బెల్ట్‌షాపు కూడా నడుపుతున్నాడు. సోమవారం రాత్రి 11.30 గంటల ప్రాంతంలో నలుగురు వ్యక్తులు కారులు వచ్చి షాపులో మద్యం కొనుగోలు చేసి తాగారు. అనంతరం మద్యం సీసా పగులగొట్టి చంపుతామని బెదిరించి రూ. 20 వేల నగదు, తున్నర్ర బంగారు చైన్ ఎత్తుకెళ్లారు. దీంతో బాధితుడు పోలీస్‌స్టేసన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశాడు.

మునిసిపల్ కార్యాలయం ముట్టడి



మునిసిపల్ కార్యాలయానికి ర్యాలీగా వస్తున్న సీపీఐ నాయకులు, పట్టణ ప్రజలు

భూపాలపల్లిటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అన్ని వాడల్లో కోతులు, కుక్కలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వాటి వేరొకచోటికి తరలించాలని డిమాండ్ చేసూ సీపీఐ ఆధ్వర్యంలో మునిసిపల్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. మునిసిపల్ కార్యాలయం వద్దకు ర్యాలీగా వస్తున్న నాయకులను పోలీసులు అరెస్టు చేసి, అనంతరం విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి సొత్కు ప్రవీణ్, గురిజవెల్లి సుధాకర్‌రెడ్డి, కొరిమి సుగుణ మాట్లాడుతూ పట్టణంలో కోతులు, కుక్కలు ప్రజలపై నిత్యం దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయని అన్నారు. ఈ క్రమంలో ఆస్పత్రుల చుట్టూ తిరిగి ఇంజక్షన్లు వేసుకుంటున్నారని అన్నారు. ఇంట్లో నుంచి బయటికి వెళ్లాలంటే తీవ్ర భయాందోళనకు గురికావాల్సి వస్తోందని అన్నారు. ఈ విషయంపై పలుమార్లు మునిసిపల్ అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని విమర్శించారు. పైగా కోతులు, కుక్కల నివారణకు నిధులు సైతం మంజూరుచేసి వాటిని పట్టుకోకుండానే నిధులు కాజేశారని ఆరోపించారు. ఇప్పటికైనా కోతులు, కుక్కలను వెంటనే పట్టణం నుంచి బయటికి పంపించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు నూకల చంద్రమౌళి, మాతంగి రామచందర్, పల్లె కృష్ణ, జోసెఫ్, రమేష్, గంప రాజు, పెదమాముల్ సంధ్య, శ్రీలత, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

అధిక సాంద్రత పత్తి సాగుతో అధిక దిగుబడి

రైతు విజ్ఞాన కేంద్ర ప్రధాన శాస్త్రవేత్త శ్రీలత



కంచనపల్లిలో సాగును పరిశీలిస్తున్న శాస్త్రవేత్త శ్రీలత

రఘునాథపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అధిక సాంద్రత పత్తి సాగుతో అధిక దిగుబడి సాధ్యమని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్ర ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ డి.శ్రీలత అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, రైతు విజ్ఞాన కేంద్రం-యాదాద్రి భువనగిరి ఆధ్వర్యంలో మండలంలోని కంచనపల్లిలో కేంద్రియ పత్తి పరిశోధనా సంస్థ ప్రత్యేక ప్రాజెక్టులో భాగంగా అధిక సాంద్రత పత్తి సాగు విధానం పై మంగళవారం క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీలత మాట్లాడుతూ అధిక సాంద్రత పత్తి సాగును జిల్లా వ్యాప్తంగా మరింత విస్తరించాలని, అధిక సాంద్రత సాగులో మొక్కలు, వరుసల మధ్య దూరాన్ని తగ్గించి ఎకరాకు ఎక్కువ మొక్కలు వచ్చేలా విత్తుకోవాలని రైతులకు సూచించారు.

ఎకరాకు 25వేల నుంచి 35వేల మొక్కలు ఉండేలా విత్తుకోవాలన్నారు. కేంద్రం ప్రోత్సాహకంగా ఎకరాకు రూ. 5వేలు రైతు ఖాతాలో జమ చేస్తుందన్నారు. కార్యక్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఏడీఏ వసంత సుగుణ, ఏవో శ్రీనివాస్ రెడ్డి, కిషన్ రావు, ఎఈవో కరుణాకర్, లోనే రవిందర్, ప్రభాకర్, నాగేశ్వర రావు, సోమిరెడ్డి, యాదగిరి, అంజయ్య, దశరథం, రామకృష్ణ, అంజిరెడ్డి, నర్సిరెడ్డి, వేణు, రాజేష్, భానుచందర్, రూప పాల్గొన్నారు.

పోక్సో కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష

వాజేడు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో నిందితుడికి ములుగు జిల్లా కోర్టు 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. బాధితురాలికి రూ. 10 లక్షల పరిహారం ఇవ్వాలని ఆదేశించింది. ఈ మేరకు ఎస్పీ శబరీశ్ వెల్లడించారు. వాజేడు మండలంలోని బొమ్మనపల్లికి చెందిన సోడి సందీప్ అనే వ్యక్తిపై 2022లో పోక్సో కేసు బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై హరీశ్ నమోదు చేశారు. ఈ కేసును మొదటి దర్యాప్తు అధికారిగా అశోక్ కుమార్, రెండో దర్యాప్తు అధికారి సంకీర్త్ వ్యవహరించారు. కోర్టులో కేసు నడుస్తున్న క్రమంలో మంగళవారం తీర్పు వెలువడింది. సోడి సందీప్‌కు 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 9 వేల జరిమానాను విధించారు. నిందితుడికి శిక్ష పడే విధంగా కృషి చేసిన పీపీ రాంసింగ్, సీడీవో నాగరాజును ఎస్పీ అభినందించారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మొగుళ్లపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని పోతుగల్లు వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను స్థానిక పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం... పోతుగల్లు వాగు వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టగా ఎలాంటి అనుమతుల్లేకుండా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను గుర్తించారు. ట్రాక్టర్ల యజమానులు బద్దంపల్లి గ్రామానికి చెందిన కాశిరెడ్డి అశోక్, వాగొడ్డుపల్లికి చెందిన గడ్డి సాయికుమార్, కొర్కిశాలకు చెందిన చిన్నబోయిన తిరుపతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

నేషనల్ సైన్స్ కాన్ఫరెన్స్‌కు ఉపాధ్యాయులు



ప్రభాకర్



మధు

మహదేవపూర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో ఈనెల 5 నుంచి 8వ తేదీ వరకు జరగనున్న నేషనల్ సైన్స్ టీచర్స్ కాన్ఫరెన్స్‌లో మహదేవపూర్ బాలుర పాఠశాల ఉపాధ్యాయుడు బి.ప్రభాకర్ రెడ్డి, బాలికల పాఠశాల ఉపాధ్యాయుడు మడక మధు పాల్గొననున్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 162 మంది సైన్స్ ఉపాధ్యాయులు ఇందుకు ఎంపికయ్యారు. తెలంగాణ నుంచి ఎంపికైన ముగ్గురిలో మహదేవపూర్‌కు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. వీరిని మండల విద్యాధికారి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అభినందించారు.



జరిమానా విధిస్తున్న ఎంవీఐ శ్రీనివాస్

పాఠశాల బస్సు నిర్వహణపై జరిమానా

కృష్ణకాలనీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రానికి చెందిన ప్రైవేటు పాఠశాల బస్సులో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించి ప్రయాణించడంపై జరిమానా విధించారు. జిల్లా రవాణాశాఖ అధికారి సమ్మానీ ఆదేశానుసారం మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ నేతృత్వంలో సిబ్బంది జిల్లా కేంద్రంలో వాహనాల తనిఖీలు చేపడుతున్న క్రమంలో అటుగా వెళ్తున్న పాఠశాల బస్సును పరిశీలించారు. 37 మంది విద్యార్థులు ఉండాల్సి ఉండగా, 46 మంది విద్యార్థులను బస్సులో ఎక్కించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ వెంటనే ఆ బస్సు నిర్వాహకులపై జరి మానా విధించారు.

కాళేశ్వరంలో ప్రత్యేక పూజలు



లక్ష వత్తుల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మహదేవపూర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయానికి భక్తులు మంగళవారం భారీగా తరలివచ్చారు. కార్తీక మాసం కావడంతో భక్తులు పుణ్య స్నానం ఆచరించి స్వామివారికి అభిషేకాలు చేశారు. అలాగే కాలసర్పదోష పూజలు చేయించుకునేందుకు భక్తులు క్యూకట్టారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులు బ్రాహ్మణులకు ఉసిరి దానాలు, దీపదానాలు చేశారు. ఆలయ ఆవరణలోని ఉసిరి చెట్టు కింద లక్ష వత్తులు వెలిగించారు.

ఒక్క రోజే 3.44 లక్షల ఆదాయం

కార్తీకమాసాన్ని పురస్కరించుకుని శీకాళేశ్వర ముక్తీశ్వరాలయానికి మంగళవారం భారీ ఆదాయం సమకూర్చింది. ఒక్కరోజే లడ్డు ప్రసాదం, పూజ టికెట్ల పై రూ.3.44 లక్షలు సమకూరాయని ఆలయ అధికారులు తెలిపారు.

అన్నారం బ్యారేజీలో మృతదేహం లభ్యం

మహదేవపూర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని అన్నారం బ్యారేజీ తీర ప్రాంతంలో ఓ మృతదేహం లభ్యమైంది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా మంథని పట్టణానికి చెందిన రావికంటి సాయికృష్ణ (30) సోమవారం మంథని వద్ద గోదావరిలో గల్లంతయ్యాడు. సోమవారం నుంచి అతడి ఆచూకీ కోసం గాలించగా మంగళవారం అన్నారం బ్యారేజీ వద్ద మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని మంథని పోలీసులకు అప్పగించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

కాటారం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన సంఘటన భూపాలపల్లి జిల్లా కాటారం మండలం గంగారంలో చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. చీర్ల రాజయ్య, గౌరక్క దంపతుల కుమారుడు చీర్ల దేవేందర్(33) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తండ్రి రాజయ్య చాలా ఏళ్ల క్రితమే మృతి చెందడం, భార్య విడాకులు తీసుకుని వెళ్లిపోవడంతో తల్లితో కలిసి ఉంటున్నాడు. మంగళవారం సాయంత్రం దేవేందర్ తన ఇంటి వద్ద ఉన్న కరెంట్ మోటార్‌ను ఆన్ చేయగా స్టార్ట్ కాలేదు. దీంతో మోటార్‌కు ఉన్న వైర్లను సరిచేస్తున్న క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై పక్కకు పడిపోయాడు. చుట్టుపక్కల వారు గమనించి పరుగున వచ్చేసరికే దేవేందర్ మృతి చెంది ఉన్నాడు. మృతుడి తల్లి గౌరక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

23న మోషన్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉచిత విద్య


మోషన్ కాలేజీ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న మోషన్ కాలేజీ చైర్మన్ వేణుగోపాల్ గౌడ్

హనుమకొండ టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : దేశంలోనే అగ్రగామి విద్యా సంస్థ అయిన రాజస్తాన్ కోట మోషన్ ఐఐటీ, నీట్ కాలేజీలో ఈ నెల 23న మోషన్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్ నిర్వహిస్తున్నట్లు మోషన్ కాలేజీ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ తెలిపారు. మంగళవారం హనుమకొండ నయీంనగర్‌లోని మోషన్ ఐఐటీ, నీట్ జూనియర్ కళాశాలలో మోషన్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ మాట్లాడుతూ ఈ టాలెంట్ టెస్టులో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని టాలెంట్ టెస్టు రాసే విద్యార్థుల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన పది మంది విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తామని ప్రకటించారు. దేశ వ్యాప్తంగా మోషన్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్ రాసే విద్యార్థులలో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన 500 మంది విద్యార్థులకు ఉచిత విద్య, రూ.2.50 కోట్ల ప్రైజ్‌మనీ ఇవ్వనున్నట్లు తెలిపారు.

నీట్ వరంగల్ సెంటర్ నుంచి టాలెంట్ టెస్టులో మొదటి 10 ర్యాంకులు సాధించిన విద్యార్థులలో మొదటి ర్యాంకు విద్యార్థికి ల్యాప్‌టాప్, రెండవ ర్యాంకు సాధించిన విద్యార్థికి ట్యాబ్ ఇవ్వనున్నట్లు ఈ అవకాశాన్ని ఈ సంవత్సరం పదో తరగతి చదువుతున్న స్టేట్ సీబీఎస్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ట్యాలెంట్ టెస్టు రిజిస్ట్రేషన్ కోసం సెల్ నంబర్:97030 00850 లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మోషన్ కాలేజీ బ్రాంచ్ హెడ్ ముత్యాల సురేష్, ఏజీఎం శనిగరపు సుమన్, ఏవో తాళ్లపెల్లి రమేష్, పాక నాగరాజు, రచ్చ కుమార్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటీవ్ సభ్యులు సురేందర్, తాళ్లపెల్లి వెంకట్, రావుల రవీందర్, ఒంటేరు మనోహర్, బోడ సంతోష్, జి. అనిల్, రంజిత్, కాలేజీ సిబ్బంది లక్ష్మణ్, మౌనిక, ఉమ తదితరులు పాల్గొన్నారు.



రామప్ప ఐలాండ్ నమూనా

రామప్ప సరస్సులో స్మృతివనం ఎప్పుడో?

- రూ.90 కోట్లతో ఏర్పాటుకు మంత్రి జూపల్లి హామీ
- ముందుకు పడని అడుగు

వెంకటాపూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్పపై రాష్ట్ర పర్యాటకశాఖ చిన్నచూపు చూస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సాక్షాత్తు రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు రామప్పను గత ఆగస్టులో సందర్శించిన సందర్భంగా ఇచ్చిన హామీలన్నీ నీటిమూటలుగానే మిగిలాయి. శివుడి విగ్రహం హామీపై ఇంతవరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం పట్ల అటు పర్యాటకులు, ఇటు భక్తులు శివశివా... నీపైనే మాట తప్పారంటూ గుసగుసలాడుకుంటున్నారు. అంతర్జాతీయ స్థాయి పర్యాటకుల సంఖ్య పెరుగుతున్నా ఆస్థాయిలో అభివృద్ధి జరగ డంలేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. రామప్ప సరస్సు ప్రాంతంలో కాకతీయ కళారూపాలను కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రధానంగా సరస్సు మధ్యలోని ఐలాండ్‌లో భారీ శివలింగం, చెరువు కట్టపై శివుడి విగ్రహం, ధ్యాన మందిరం, పిల్లల కోసం శివుడి విగ్రహంతో ద్వీపం ఆధ్యాత్మికత సంతరించుకునేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్, పర్యాటకశాఖ అధికారులకు సూచించినప్పటికీ ఇప్పటికీ ఫలితంలేదు.

భక్తులు సందర్శించుకునేందు కు వీలుగా రోప్‌వే నిర్మాణం చేపడతామని మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యాటకశాఖ అధికారులకు చెప్పినప్పటికీ ఇప్పటివరకు ఆహామీ నీటమూటగానే మిగిలింది. రూ.90 కోట్లతో ఏర్పాటు చేస్తామన్న స్మృతివనం స్థలం ఇప్పటికీ శూన్యంగానే దర్శనమిస్తోంది. రామప్ప ఆలయ పరిసర ప్రాంగణంలో ప్రసాద్‌స్కీంలో భాగంగా అనేక అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి.

కానీ, సరస్సు ప్రాంతంలో రాష్ట్రమంత్రి జూపల్లి కృష్ణారావు ఇచ్చిన హామీలు కార్యరూపం దాల్చకపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.



ఐలాండ్‌లో ఏర్పాటుచేసే భారీ శివుడి విగ్రహం నమూనా



గృహ సిలిండర్ల మాయాజాలం

గ్యాస్ ఏజెన్సీల కక్కుర్తి

- వ్యాపార సంస్థలకు అక్రమంగా తరలింపు...
- బడా హోటళ్ల నుంచి చిరు వ్యాపారాల వరకు ఇష్టారాజ్యంగా వాడకం
- తనిఖీలే చేపట్టని అధికారులు

హనుమకొండ సిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలకు విరుద్ధంగా గ్యాస్ సిలిండర్లు చిరు వ్యాపార సంస్థలకు తరలుతున్నాయి. సివిల్ సప్లయిస్ అధికారులు, కొన్ని గ్యాస్ ఏజెన్సీల కంపెనీలకు ఈ విధానం కాసులు కురిపిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఈ దందా నిరాటంకంగా సాగుతోంది. యధేచ్చగా డొమెస్టిక్ సిలిండర్లు కమర్షియల్ రంగాలకు తరలుతున్నాయి. ఇదంతా బాహాటంగానే గ్యాస్ సిలిండర్లు వ్యాపార సంస్థలకు చేరుతున్నాయి. చిరు వ్యాపార సంస్థల వినియోగం అందరికి కనిపించే దృశ్యమే. ఇంత విచ్చలవిడిగా దందా జరగడానికి సివిల్ సప్లయిస్ అధికారుల దురాశే. సిలిండర్ల తరలింపును అడ్డుకోరు. తనిఖీలు చేయడరు. ప్రజలు ఎవరైనా ప్రమాద అంశమై ఫిర్యాదు చేసినా జాన్ తా నహీ అంటూ తాపీగా ఉంటారు. గ్యాస్ ఏజెన్సీల నుంచి నెల వారిగా ముట్టాల్సిన మామూళ్లు చేతిలో పడితే చాలు ఏమైతే మాకేంటి ధోరణితో అధికారులు ఉన్నారు. మరో వైపు గ్యాస్ ఏజెన్సీలు కూడా అధికారుల అండతో అక్రమంగా సిలిండర్లను తరలిస్తూ అడ్డదారిలో దోచుకుంటున్నారు.

బడా హోటళ్ల నుంచి...

హనుమకొండ జిల్లాలోని బడా హోటళ్లు, రెస్టారెంట్లు, క్లౌడ్ కిచెన్, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, కర్రీ పాయింట్లు ఇలా గ్రామ, మండల, నగరంలోని ప్రధాన జంక్షలు ఇతర చోట్ల టిఫిన్ సెంటర్లు, తోపుడు బండ్ల వ్యాపారాలు ఇతర చిన్నా చితక వ్యాపార సెంటర్ల యజమానులు డొమెస్టిక్ సిలిండర్లకు కమర్షియల్‌కు వినియోగిస్తున్నారు. ఈ విధానం నిబంధనలకు పూర్తి విరుద్ధం. వ్యాపార సంస్థలు కమర్షియల్ సిలిండర్లను మాత్రమే వినియోగించాలి. విరుద్ధంగా వ్యవహరిస్తే సివిల్ సప్లయిస్ అధికారులు కేసులు బనాయిస్తారు. అంతే కాదు నోటీసులు జారీ చేసి సీజ్ కూడా చేయవచ్చు. ప్రజా ప్రయోజనాల రీత్యా ఈ చర్యలు తీసుకుంటారు. కమర్షియల్ సిలిండర్లు నీలి రంగుతో ఉంటాయి. సిలిండర్ బరువు 19 కేజీలు. ఇక గృహ వినియోగ సిలిండర్లు రెడ్ కలర్‌తో ఉండి 14.2 కేజీల బరువుతో ఉంటాయి. ఇలా ఏ విభాగంలోని సిలిండర్లు ఆ మేరకే వినియోంచాల్సి ఉంటుంది.

మామూళ్ల మత్తు

హనుమకొండ జిల్లాలోని ఫుడ్ వ్యాపార రంగాల యజమానులు సివిల్ సప్లయిస్ అధికారులకు పెద్ద ఎత్తున మామూళ్లు అందచేస్తున్నారు. ఈ కారణంగా అధికారులు కమర్షియల్ సిలిండర్ల అక్రమ తరలింపును పట్టించుకోకుండా దందా సాఫీగా సాగేలా ఊతమిస్తున్నారు. నీలి రంగు నిలిండర్లను వినియోగం చిరు వ్యాపారాల సంస్థల్లో అయితే కళ్లకు కట్టినట్లు కనిపిస్తుంది. గమనించిన వారు ఎవరైనా ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించరు. తనిఖీలు చేయరు. కేసుల నమోదు లేదు. ఇక కొందరు డొమెస్టిక్ కస్టమర్లు, సబ్సిడీ లబ్దిదారులు దురాశ కూడా దందాకు సహాయంగా మారింది.

గీత దాటుతున్న వినియోగం...

డొమెస్టిక్, కమర్షియల్ సిలిండర్లకు వేరు వేరుగా సెఫ్టీ మెజర్స్ ఉంటాయి. గ్యాస్ స్టవ్, పైప్, రెగ్యులేటర్ తదితరమైనవి వేటి కవే వేరుగా రూపొందించడం జరుగుతుంది. డొమెస్టిక్ విభాగంలోని సిలిండర్లను విరుద్ధంగా వినియోగిస్తే పేలుడు సంభవించడానికి అవకాశాలు ఉన్నట్లే. ఇది తెలిసినా వ్యాపారులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. పేలుడు జరిగితే ప్రాణ నష్టంతో పాటు భారీ ఆస్తి కూడా ఉంటుంది. పైగా చుట్టూ పక్కల ఉన్న భవనాలు, ఇతర వ్యాపార రంగాలకు కూడా ప్రమాదం పొంచి ఉన్నట్లే. ఇంత ప్రమాద స్థితి నెలకొన్నప్పటికీ అధికారులు, గ్యాస్ ఏజెన్సీల కంపెనీలు కాసులకు కక్కుర్తి పడి బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారు. ఇక మరింత ప్రమాదకరమైన అంశం ఏమిటంటే...డొమెస్టిక్ సిలిండర్‌లోని గ్యాస్‌ను వ్యాపారులు ఏమాత్రం సురక్షితం కానీ పద్దతిలో పైపుల ద్వారా కమర్షియల్ సిలిండర్లకు పంపింగ్ చేస్తున్నారు.

ప్రభుత్వం అందచేస్తున్న సబ్సిడీ సిలిండర్లను డబ్బులకు ఆశపడి గ్యాస్ ఏజెన్సీలకు సహకరిస్తున్నారు. డబ్బులు రావడంతో ఒకే కుటుంబంలోని వారు వేరు వేరుగా కూడా గ్యాస్ కనెక్షన్లు పొంది ఈ మార్గంలో సొమ్ము చేసుకుంటున్నారు.

నేడే కందికొండ జాతర

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారగణం
- వేలాదిగా తరలిరానున్న భక్తజనం

కురవి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కార్తీకపౌర్ణమిని పురస్కరించుకుని కురవి మండలంలోని కందిగిరి పర్వతంపై నర్సింహాస్వామి, లక్ష్మీదేవిల జాతర బుధవారం జరగనుంది. ఇందుకోసం అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ జాతరకు ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల్లోని భక్తులు వేలాదిగా హాజరవుతారు. రెండు కిలోమీటర్లకుపైగా ఎత్తులో ఉన్న గుట్టపైకి ఎక్కేందుకు సరైన దారి, మెట్లులేకపోవడంతో భక్తులు రాళ్లు, రప్పలు ముళ్ల పొదల నుంచి పర్వతాన్ని అధిరోహించి స్వామివారిని దర్శించుకొంటారు.

జాతర కోసం అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. తొర్రూరు డీఎస్పీ కృష్ణకిషోర్, మరిపెడ సీఐ రాజ్‌కుమార్ సీఐ కరుణాకర్, తహసీల్దార్ విజయ, ఎంపీడీవో వీరబాబులు కొద్ది రోజులుగా కందికొండ గుట్టను సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. జాతర కోసం తొర్రూరు డీఎస్పీ ఆధ్వర్యంలో మరో డీఎస్పీ, ఆరుగురు సీఐలు, 17 మంది ఎస్సైల ఆధ్వర్యంలో మొత్తం 160 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీరోలు ఎస్సై గండ్ర సంతోష్ తెలిపారు. దొంగతనాల నివారణకు సీసీఎస్ టీమ్‌లు, ఈవ్‌టీజర్ల అదుపునకు సివిల్ డ్రెస్సుల్లో ఉన్న షీ టీమ్స్ అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. భక్తులకు తాగునీటి ఇబ్బంది తలెత్తకుండా ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో నీటివసతి, నాలుగు చోట్ల ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు రవాణా కోసం మహబుబాబాద్ బస్ డిపో కందికొండకు స్పెషల్ బస్సులను నడపనుంది.



కురవి మండలంలోని కందికొండ ఆలయంపై వెలిగించనున్న అఖండ దీపం



కందికొండ ఆలయంపై లక్ష్మీనర్సింహాస్వామి విగ్రహం

కల్యాణోత్సవం

లక్ష్మీనర్సింహస్వామి కల్యాణమహోత్సవాలు బుధవారం తెల్లవారుజామున 4 గంటల నుంచే మొదలవుతాయి. స్వామివారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించి, మంగళాశాసనములు గావించి కల్యాణ మహోత్సవాన్ని ఉదయంసమయాన్నే పూర్తిచేస్తారు. ఆపై భక్తులు స్వామివారిని దర్శించుకొంటారు.

అఖండజ్యోతి

సాయంత్రం సమయంలో మట్టి మూకుడులో కంది కొండ ఆలయంపై భాగాన అఖండజ్యోతిని వెలిగిస్తారు. ఈ మూకుడు నిండా నూనెపోసి, వస్త్రంతో మడతవేసి పెద్ద వత్తిగా చేసి వెలిగిస్తారు. ఈ దీపంలో నూనెను కందికొండ గ్రామానికి చెందిన ముస్లింలు అందించడం విశేషం. తరతరాలుగా ముస్లింలు నూనెలు అందించడం ఆచారంగా వస్తోంది. ఈ అఖండజ్యోతి చుట్టు పక్కల అనేక కిలోమీటర్ల వరకు కనిపిస్తుంది.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీహరి

రెండు రోజుల్లో పంట నష్టం నివేదిక అందజేయాలి

స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు సంబంధించిన పంట నష్టం అంచానా నివేదిక రెండు రోజుల్లో అందజేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారులను ఆదేశించారు కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో మంగళవారం స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ పరిధిలోని ధర్మసాగర్, వేలేరు మండలాలలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జరిగిన నష్టాలపై శాఖల వారీగా తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ స్నేహ శబరీష్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే కడియం సమీక్ష నిర్వహించారు. ధర్మసాగర్, వేలేరు మండలాల్లో భారీ వర్షాలతో వివిధ పంటలు, పశు సంపద, రోడ్లు, కల్వర్టులు దెబ్బతిన్న వివరాలను ఆయా శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న తాత్కాలిక పునరుద్ధరణ చర్యలు, పంట నష్ట వివరాల నమోదు, తదితర వివరాలను సంబంధిత శాఖల అధికారులు ఈ సందర్భంగా ఎమ్మెల్యే, కలెక్టర్‌కు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీహరి మాట్లాడుతూ.. పంట నష్టం అంచనాలో అధికారులు నిబంధనలు పక్కన పెట్టి రైతులకు అనుకూలంగా వ్యవహరించాలన్నారు. పంటలు నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు చేపట్టిన సర్వేను త్వరగా పూర్తి చేయాలన్నారు. భారీ వర్షాలు మరో రెండు, మూడు రోజులు ఉన్న నేపథ్యంలో ధర్మసాగర్ రిజర్వాయర్ గేట్లు ఎత్తాలన్నారు.

క్లౌడ్ బరస్ట్ వరంగల్‌లోనే చూపిస్తున్నందున రిజర్వాయర్ గేట్స్ నుంచినీటి విడుదల చేయాలన్నారు. కలెక్టర్ స్నేహశబరీష్ మాట్లాడుతూ.. పంటలు, రోడ్లు, పశు సంపద నష్టంపై సంబంధిత శాఖల అధికారుల అంచనాలను త్వరగా అందజేయాలన్నారు.పాక్షికంగా, పూర్తిగా ఇండ్లు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరుకు ప్రతిపాదనలుఅధికారులు అందజేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్‌డీవో మేన శ్రీను, పంచాయతీ రాజ్ ఈఈ ఆత్మారాం, ఇరిగేషన్ ఈఈ మంగీలాల్, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్‌సింగ్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నకిలీ బంగారం అంటగట్టి మోసం

రూ. 10 లక్షలతో ఉడాయించిన ముఠా

కాటారంలో లబోదిబోమంటున్న కిరాణా షాపు యజమాని

కాటారం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నకిలీ బంగారు కొనుగోలు చేసి మోసపోయాడు ఓ కిరణా షాపు యజమాని. అర కిలో బంగారం రూ. 15 లక్షలకే ఇస్తామని నమ్మబలికిన ఓ ముఠా, అడ్వాన్స్‌గా రూ. 10లక్షలు తీసుకొని ఉడాయించింది. ఈ ఘటన భూపాలపల్లి జిల్లాలో ఆలస్యంగా వెలుగుచూసింది. కాటారం మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలికి సమీపంలో ఉన్న కిరాణా షాపునకు రెండు వారాల క్రితం ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలు వచ్చి సరుకులు కొనుగోలు చేశారు. తాము కూలి పనుల నిమిత్తం వచ్చామని చెప్పారు. ఆ తర్వాత మరో రోజు కూడా అదే దుకాణానికి వచ్చి సెల్‌ఫోన్ రీచార్జ్ చేయించుకున్నారు. మాటల సందర్భంగా షాపు యజమానితో తమకు ఒక చోట బంగారం దొరికిందని, దాన్ని తక్కువ ధరకే అమ్ముతామని చెప్పారు.

దీంతో ఆశ పడ్డ కిరాణా షాపు యజమాని బంగారం తీసుకొచ్చి తనకు చూపించమని అడిగాడు. వారు బంగారం ముద్ద నుంచి చిన్న ముక్కను కట్ చేసి తెచ్చామంటూ దాన్ని ఆ వ్యాపారికి ఇచ్చారు. దీంతో అతడు నగలు తయారు చేసే వారికి దాన్ని చూపించడంతో అది ఒరిజనల్ బంగారమని వారు తేల్చారు. దీంతో సంబరపడ్డ కిరాణా షాపు యజమాని ఆ నలుగురితో బేరమాడాడు. ఈ క్రమంలో షాపు వద్ద ఉన్న సీసీ కెమెరాలను ఆ వ్యక్తులు ఆఫ్ చేయాలని సూచించారు. బంగారాన్ని రూ. 15 లక్షలకు ఇవ్వడానికి ఒప్పుకున్న ముఠా సభ్యులు అడ్వాన్స్‌గా రూ. 10లక్షలు వ్యాపారి నుంచి తీసుకున్నారు. మూడు రోజుల్లో మిగతా డబ్బులు ఇస్తానని అతడు చెప్పడంతో అంగీకరించారు. ఆ ముఠా వద్ద నుంచి తీసుకున్న బంగారాన్ని అదే రోజు రాత్రి వ్యాపారి మరోసారి పరిశీలించగా అది నకిలీ బంగారమని తేలింది. దీంతో లబోదిబోమన్న అతడు పోలీసులను ఆశ్రయించాడు. బంగారం పేరుతో తాను మోసపోయానని చెప్పలేక, తన గల్లా పెట్టె నుంచి ఎవరో ఎత్తుకెళ్లారని ఫిర్యాదు చేశాడు.

దీంతో రూ. 10 లక్షలు గల్లా పెట్టె నుంచి పోవడమేమిటని పోలీసులకు అనుమానం వచ్చింది. నిజమేమిటో చెప్పమని ఆ వ్యాపారిని పోలీసులు గట్టిగా అడగ్గా అసలు విషయం చెప్పి భోరుమన్నాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం కేసు నమోదు చేసిన పోలీసులు కాటారం నుంచి కాళేశ్వరం వరకు ఉన్న సీసీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలించినట్లు తెలిసింది. నకిలీ బంగారం ముఠా మహారాష్ట్ర వైపు వెళ్లిందని సమాచారం. ఈ ఘటనపై పోలీసులు వివరాలు వెల్లడించలేదు.

కలకలం రేపిన 'ఇసుకాసుర'

- అక్రమాలపై ఇంటిలిజెన్స్ వర్గాల ఆరా
- చర్చనీయాంశంగా మారిన 'ఆంధ్రజ్యోతి' కథనం

వాజేడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇసుక తవ్వకాల్లో అక్రమాలపై ఆంధ్రజ్యోతిలో మంగళవారం వెలువడిన ఇసుకాసుర కథనం కలకలం రేపింది. జిల్లాలోని ఓ ప్రధాన ముఖ్య అధికారి కనుసన్నల్లో జిల్లా, మండల అధికారుల అన్ని రకాలుగా మభ్య పెడుతూ ఈ దందా సాగుతుందని వెలుగులోకి రావడంతో చర్చనీయంశంగా మారింది. ఇసుకాసుర కథనంతో ఇసుక అక్రమార్కుల గుండెల్లో రైల్లు పరిగెడుతున్నాయి. అక్రమంగా ఇసుక తోలకాలు జరుపుతున్న ఇసుక మాఫియా పై ఇంటిలిజెన్స్ వర్గాలు ఆరా తీస్తున్నాయి.

టెండర్లు వేసిన ఇసుక క్వారీల్లో కాకుండా మరోక చోట ఇసుక తవ్వకాలు జరుపుతూ రూ. కోట్లలో దండుకుంటున్న అక్రమార్కులపై ఇంటిలిజెన్స్ విచారణ చేస్తున్నట్లు సమాచారం. అదే విధంగా గతంలో రద్దు చేసిన క్వారీలకు అనుమతులు ఇవ్వడంపై కూడా అనుమానాలు వస్తుండటంతో టీజీఎండీసీ అధికారుల పాత్ర ఎంత ఉందని చర్చ మొదలైంది. ములుగు, భూపాలపల్లి జిల్లాలో రూ. 200 కోట్లకు పైగా ఇసుకను అక్రమార్కులు దోచుకోవడంతో ఈ ఇసుక తవ్వకాల్లో ఎవరి పాత్ర ఎంత ఉంది అనే చర్చ అన్ని వర్గాల్లో మొదలైంది. ఈ ఇసుక తవ్వకాల్లో చక్రం తిప్పుతున్న అధికార పార్టీకి చెందిన కీలక నేత పాత్ర పై కూడా కాంగ్రెస్ శ్రేణులు, అధికారులలో చర్చ మొదలైంది. ములుగు జిల్లాలో 10 ఇసుక క్వారీల్లో, భూపాలపల్లి జిల్లాలోని 5 క్వారీల్లో పలు అక్రమాలు చోటు చేసుకున్నాయని ఇప్పటికే విమర్శలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో టీజీఎండీసీ అధికారుల్లో భయం మొదలైందని టాక్ వినిపిస్తుంది. ఇసుక అక్రమార్కులకు అండగా నిలుస్తున్న టీజీఎండీసీ అధికారుల ఉదాసీనతపై కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమాలపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.


గతంలో జరిమానా

వెంకటాపురం మండలంలోని రామచంద్రాపురం ఇసుక క్వారీలో గతంలోజరిగిన విధంగానే ప్రస్తుతం బోదాపురం-2 ఇసుక ర్యాంపులో అక్రమాలు కొనసాగతున్నాయి. మైనింగ్ శాఖ నుండి ఎండీఎల్ అనుమతి లేకపోవడంతో రామచంద్రాపురం ర్యాంపుకు అప్పటి కలెక్టరు కృష్ణ ఆదిత్య జరిమానా విధించారు. కానీ ఇప్పుడు బహిరంగంగా అక్రమాలు చోటు చేసుకుంటున్నా జిల్లా అధికారులు స్పందించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

ఆన్‌లైన్‌లో కవితా సంపుటి వేలం

రూ.42వేలకు దక్కించుకున్న యువతి

వరంగల్ కల్చరల్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కొంకపాక గ్రామానికి చెందిన బొంపెల్లి శ్రీనివాస్ అనే యువకుడు తొలిసారిగా రచించిన కవితా సంకలనం 'నా దాహం.. ప్రపంచం'కు ఆన్‌లైన్‌లో విశేష స్పందన వచ్చింది. మన దేశ కరెన్సీ ప్రకారం రూ.42వేలకు అమెరికాలో నివసిస్తున్న మిర్యాలగూడకు చెందిన మైలవరపు అఖిల అనే యువతి మొదటి పుస్తకాన్ని కొనుగోలు చేశారు. తెలంగాణ పబ్లికేషన్స్ హైదరాబాద్ వారు ముద్రించిన ఈ పుస్తకాన్ని ఆదివారం రాత్రి అమెరికాలో ఆన్‌లైన్ కవి బొంపెల్లి శ్రీనివాస్ స్నేహితులు, అభిమానులు ఆన్‌లైన్‌లో విక్రయానికి పెట్టారు. ఈ పోటీలో అఖిల అనే యువతి రూ.42వేలకు కొనుగోలు చేయడం గమనార్హం. త్వరలోనే ఈ పుస్తకాన్ని దేశంలోని పాఠకులందరికీ ఆన్‌లైన్ ద్వారా అందుబాటులోకి తెస్తామని శ్రీనివాస్ స్నేహితులు తెలిపారు. ఈ సందర్భంగా కవి శ్రీనివాస్ తల్లిదండ్రులు బొంపెల్లి దేవేందర్‌రావు లక్ష్మీ, శ్రీనివాస్ స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు.



బొంపెల్లి శ్రీనివాస్ రాసిన నా దాహం.. ప్రపంచం పుస్తకం

మేడారంలో సౌకర్యాల కల్పన

తాడ్వాయి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మేడారంలో పునరుద్ధరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. అలాగే జనవరి 28న మహాజాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లను ఇప్పటి నుంచే చేపట్టినట్టు తెలుస్తోంది. సమ్మక్క-సారలమ్మల మహా జాతరకు తరలివచ్చే భక్తకోటికి ప్రభుత్వం చేపట్టిన సకల సౌకర్యాలలో భాగంగా మేడారం, పరిసర గ్రామాల్లో విద్యుత్ మరమ్మత్తుల పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో పనులు నవంబరు చివరి వారంలో పనులు పూర్తి అవుతాయని అధికారులు అంటున్నారు.

గద్దెల ప్రాంగణంలో దుకాణాల తొలగింపు

మేడారంలో సమ్మక్క-సారలమ్మల దేవస్థానం పునరుద్ధరణ పనుల్లో భాగంగా అధికారులు దేవస్థానం పరిసరాల్లో ఉన్న దుకాణాలను మంగళవారం తొలగించారు. దీంతో చిరువ్యాపారులకు నిరాశ ఎదురైంది. చిన్న చిన్న దుకాణాలు ఏర్పాటు చేసుకొని జీవనోపాధి పొందుతున్న వారికి బతుకుదెరువు దూరమైపోయింది. గిరిజన వ్యాపారులు ఐటీడీఏ షాపింగ్ కాంప్లెక్స్‌లో దుకాణాలు ఏర్పాటు చేసుకునేలా అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.



విద్యుత్ వైర్లు బిగిస్తున్న సిబ్బంది

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని ర్యాలీ

ములుగు రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయిం బర్స్‌మెంట్స్‌ను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వ ర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. మంత్రి సీతక్క క్యాంపు కార్యాల యం ముట్టడికి ప్రయ త్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సంద ర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామెర కిరణ్ మాటా డుతూ విద్యార్థులకు రావలసిన ఫీజు రీయిం బర్స్‌మెట్ విడుదల చేయడంలో రాష్ట్ర ప్రభు త్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. రూ. 9 వేల కోట్లు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయిం బర్స్‌మెంట్ రావాల్సి ఉందన్నారు. ఇప్ప టికైనా ప్రభుత్వం పెండింగ్ బకాయిలను విడు దల చేసి ప్రైవేట్ యాజమాన్యాలను, విద్యార్థుల ను ఆదుకోవాలని లేకపోతే మంత్రులను, ఎమ్మె ల్యేలను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రావి రవితేజ, ఉపాధ్యక్షుడు బాలిశ్వర్ జశ్వంత్, నాయ కులు భాను, రాకేష్, రత్నం సురేష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

భూపాలపల్లి సీఐ నరేష్ కుమార్



విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ నరేష్

కృష్ణకాలనీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): యువత చెడు వ్యవసనాలకు దూరంగా ఉండాలని భూపాలపల్లి సీఐ నరేష్‌కుమార్ సూచించారు. మంగళ వారం భూపాలపల్లి పోలీసు ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రస్తుతం యువత బెట్టింగ్ యాప్స్, ఆన్‌లైన్ పార్ట్‌టైం జాబ్స్ నేరాలు, సైబర్ నేరాలకు ఎక్కువగా లోనవుతున్నారన్నారు. అలాంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అశ్లీల చిత్రాలు చూడటం, సోషల్ మీడియా ద్వారా ఇతరులకు పంచుకోవడం, వంటి చర్యలు నేరమన్నారు. వాటి జోలికి ఎవరూ వెళ్లొద్దని, అలాంటి వారిపై జాతీయ స్థాయిలో నిఘా ఉంటుందని అన్నారు. సోషల్ మీడియాను మంచి కోసం మాత్రమే వినియోగించుకోవాలన్నారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1098కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బాలునాయక్, లెక్చరర్లు పాల్గొన్నారు.

పోతుల్వాయిలో అష్టోత్తర శతనామ సంకీర్తన

కాటారం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇబ్రహీంపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న పోతుల్వాయి సాంబశివ స్వామి ఆలయంలో అష్టోత్తర శత (108)నామ భజన కీర్తనల స్వరాభిషేకం మంగళవారం ఘనంగా జరిగింది. జయశంకర్ సారస్వత సమితి జిల్లా ప్రతినిధులు గడ్డం లక్ష్మయ్య, నిడిగొండ మణి, జైశ్రీరాం గాయక సమూహ సాహితీ వేదిక తెలంగాణ కన్వీనర్ పుల్లూరి నాగేశ్వర్, పోతుల్వాయి సాంబశివ సన్నిహిత శ్రావణ్ బృందం ఆధ్వర్యంలో పలువురు కవులు, గాయకులు స్వరాభిషేక మహాయజ్ఞంలో పాల్గొన్నారు. 108కీర్తనలు, 5 మంగళ నీరాజనాలతో కార్యక్రమం వైభవంగా సాగింది. పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లా పరిధిలోని పలు మండలాలకు చెందిన గాయకులు భజనపాటలతో అలరించారు. కళాకారులు, కవులకు నిర్వాహకులు ఈ సందర్భంగా సన్మానించారు. ఈ కార్యక్ర మంలో అర్చకుడు సురేష్, నిర్వాహకులు శ్రావణ్, రాజేషం, గాయకులు, కవులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



కవి, గాయకులను సత్కరిస్తున్న నిర్వాహకులు

చెకుముకి పోస్టర్ ఆవిష్కరణ

భూపాలపల్లిటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసే కార్యక్రమంలో భాగంగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పోస్టర్‌ను ఆ సంఘం నాయకులు జిల్లా విద్యా శాఖాధికారి రాజేందర్ చేతుల మీదుగా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా డీఈవో రాజేందర్ మాట్లాడుతూ ఈ పోటీ పరీక్షలో 8 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. దీంతో విద్యార్థులు తమ విజ్ఞానాన్ని మరింత రెట్టింపుచేసుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వేదిక జిల్లా అధ్యక్షుడు పొగాకుల రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి వేల్పుల రాజు, జిల్లా సైన్స్ అధికారి బర్ల స్వామి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుభాకర్‌రెడ్డి, కిరణ్‌కుమార్, సీఎంవో రమేష్, ప్లానింగ్ కోఆర్డినేటర్ రాజగోపాల్, జీసీడీవో శైలజ తదితరులు పాల్గొన్నారు.

- చిట్యాల (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చెకుముకి టాలెంట్ టెస్ట్ పోస్టర్‌ను ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీరాం రఘుపతి ఆవిష్కరించారు. ఈ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు చెకుముకి టెస్ట్ దోహదపడుతుందన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 7న పాఠశాల స్థాయి, 21న మండల స్థాయిలో చెకుముకి టెస్ట్‌ను నిర్వహించనున్నట్లు జేవీవీ మండల కన్వీనర్ సూధం సాంబమూర్తి తెలిపారు. ఉపాధ్యాయులు వేల్పుల రాజు, రాధాకృష్ణ, బొమ్మ రాజమౌళి, బుర్ర సదయ్య, శ్రీనివాస్, రామనారాయణ, నీలిమారెడ్డి, సరళదేవి, విజయలక్ష్మి, సుజాత, మౌనిక, కల్పన. శంకర్, ఉస్మాన్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్‌ను పకడ్బందీగా చేపట్టాలి

కాటారం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన గాలికుంటు నివారణ టీకాల (ఎఫ్‌ఎండీ) పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేయాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ గోపాలకృష్ణమూర్తి వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని రేగులగూడెం, దేవరాంపల్లి గ్రామాల పరిధిలో పశువులకు చేపట్టిన ఎఫ్‌ఎండీ వ్యాక్సినేషన్‌ను ఏడీ ఆకస్మిక తనిఖీ చేశారు. అన్ని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల వెటర్నరీ వైద్యాధికారి డాక్టర్ రమేష్, డాక్టర్ ధీరజ్, వెటర్నరీ అసిస్టెంట్ తుంగల రాజశేఖర్ పాల్గొన్నారు.

మానేరు వైపు వెళ్లొద్దు

మల్హర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : పరీవాహక ప్రాంత రైతులు మానేరు వైపు వెళ్లొద్దని తహసీల్దార్ రవికుమార్ మంగళవారం తెలిపారు. ఎల్‌ఎండీ గేట్లు ఎత్తి నాలుగు వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్న నేపథ్యంలో రైతులు, పశువుల కాపర్లు మానేరు వైపు వెళ్లొద్దన్నారు.

జాదరావుపేట యూత్ కాంగ్రెస్ కమిటీ ఎన్నిక

కాటారం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి):మండలంలోని జాదరావుపేట జీపీ పరిధిలో యూత్ కాంగ్రెస్ కమిటీ ఎన్నిక మంగళవారం జరిగింది. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చీటూరి మహేష్‌గౌడ్ సమక్షంలో యూత్ నాయకులు సమావేశమై నూతన గ్రామ కమిటీ ని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా అరికిళ్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కోట రవి, ఉపాధ్యక్షుడిగా దుర్గం అజయ్, కోశాధికారిగా గుండం మహేష్, కార్యదర్శిగా కుదుదుల శివసాయి, అధికార ప్రతినిధిగా దుర్గం దినేష్, ప్రచార కమిటీ కన్వీనర్‌గా గోమాస మనోజ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మహేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆత్మకూరి రాజయ్య, సీనియర్ కాంగ్రెస్, యూత్ నాయకులు ఆరెళ్ల సదానందం, అబ్దుల్ మజీద్, బొద్దుల సతీష్, శంకర్‌గౌడ్, అనుమల తిరుపతి, దుర్గం విజయ్, శంకరయ్య, మహేష్, రాకేష్, రాజబాపు, శ్రీనివాస్, మారగోని శ్రావణ్, చీకట్ల సిరోజ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

జూనియర్ కళాశాలను మంజూరు చేయాలి

టేకుమట్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలానికి జూనియర్ కళాశాలను మంజూరు చేయాలని కోరుతూ తహసీల్దార్ విజయలక్ష్మికి సీపీఐ (ఎంఎల్)-లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారపెల్లి మల్లేష్ మంగళవారం వినతిపత్రం అందజేశారు. టేకుమట్ల నూతన మండలంగా ఏర్పాటై తొమ్మిదేళ్లు పూర్తి కావస్తున్నా ఇప్పటి వరకు జూనియరు కళశాల ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో వీసీకే రాష్ట్ర యూత్ అధ్యక్షుడు అంబాల అనిల్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భూక్య నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు భూసార పరీక్షల పత్రాలు అందజేత

మహాముత్తారం, నవంబరు4(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోర్లగూడెంలో రైతులకు భూసార పరీక్షల విశ్లేషణ పత్రాలను మండల వ్యవసాయాధికారి జి. అనుషా మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూసార పరీక్షలకు అనుగుణంగా రైతులు పంటలను ఎంపిక చేసుకొని అవసరమైన ఎరువులను వాడాలని, తద్వారా మంచి ఫలితాలు సాధించొచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఈవోలు శివకృష్ణ, ప్రవళిక, శశివర్ధన్, ఉద్యాన విస్తరణ అధికారి రాందాస్ పాల్గొన్నారు.

వైన్ షాపును తరలించాలి

చిట్యాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల కు సమీపంలో ఉన్న వైన్‌షాపు మరో ప్రాంతానికి తరలించాలని బీకేసీ పార్టీ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ ఇమామ్ బాబా షేక్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వీసీకే పార్టీ యూత్ రాష్ట్ర అధ్యక్షుడు అంబాల అనిల్ కుమార్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భూక్యా నవీన్ మాట్లాడుతూ వైన్‌షాపు, బెల్టుషాపులతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

ఉన్నత పాఠశాలకు వితరణ

వెంకటాపూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీదేవిపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు విద్యార్థుల సౌకర్యార్థం మంగళవారం జాదవ్ పూర్వ విద్యార్థుల అసోసియేషన్, ప్రియనేస్తం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో పది డ్యూయల్ డెస్కుల పంపిణీ జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బండి సురేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి 5వ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ సీతారాం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు స్థానికంగా ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ ఎన్నో ఆవిష్కరణలు చేయాలన్నారు. ప్రతి ఒక్కరిలో అనేక శక్తులు దాగి ఉంటాయని, స్పందిస్తూ ఆలోచన చేసిన కొలది అవి వెలుగులోకి వస్తాయని, తనవంతు సహాయం కూడా ఏదో ఒక రూపంలో పాఠశాలకు ఉంటుందని అన్నారు. ప్రధానోపాధ్యాయుడు సురేష్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయ బృందం నిర్విరామంగా కృషి చేస్తున్నారని, ఇప్పటికే చాలా మార్పులు తీసుకువచ్చామని అన్నారు.

పాఠశాలకు డ్యూయల్ డెస్కులు అందజేసిన జాదవ్ పూర్వ విద్యార్థులు, ప్రియనేస్తం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు నాగరాజుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 5వ బెటాలియన్ సబ్ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు అజ్మీరా కవిత, అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కారుపోతుల యాదగిరి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సూత్రాల రవి, సలేంద్రం, కలాం ఫౌండేషన్ అధ్యక్షుడు సర్వర్ అహ్మద్, ఉపాధ్యాయులు పద్మ, శ్రీనివాస్, సుధాకర్, కృష్ణమూర్తి, ఆనందం, తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో
రైతులకు మేలు

కన్నాయిగూడెం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలు రైతులకు ఎంతో మేలు కలిగిస్తాయని వ్యవసాయ శాఖ ఏటూరునాగారం సహాయ సంచాలకుడు అవినాష్ వర్మ అన్నారు. హైదరాబా ద్‌లోని సచివాలయం నుంచి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో ఆయన పాల్గొనానరు. మండల కేంద్రంలోని రైతువేదికలో రైతులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కంతనపల్లి గ్రామ రైతులకు భూసార పరీక్షలు నిర్వహించిన పత్రాలను అందజేశారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలన్నారు. ఆయిల్ పామ్ సాగు ఆవశ్యకత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ముంజ మహేష్, గోవిందరావు పేట మండల వ్యవసాయ శాఖ అధికారి కె.జితేందర్‌రెడ్డి, ఏఈవోలు కల్యాణి, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా
మీసేవ అవతరణ దినోత్సవం

వెంకటాపూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీదేవిపేట గ్రామంలో మీసేవ వీఎల్ఈ చిలుక తిరుపతి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా మీసేవ అవతరణ దినోత్సవం జరిగింది. ఈసందర్భంగా లబ్ధిదారులకు స్వీటు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. అనంతరం తిరుపతి మాట్లాడుతూ 2011 నవంబరు 4న మీసేవ అవతరణ జరిగిందని అన్నారు. దీనిద్వారా ప్రజలకు అందుబాటులో సులువుగా జరిగే పనులు మీసేవ ద్వారా జరుగుతున్నాయని పేర్కొన్నారు. లక్ష్మీదేవిపేట పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు మీసేవను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్ర మంలో మీసేవ లబ్ధిదారులు చిర్ర గణేష్, వరికోల్ రమేష్, దేనబోయిన శంకర్, కడివెండి తిరుపతి, గుగులోత్ వాగ్యా, మేక రమేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

మంగపేట నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాయిని వీరేందర్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు జరిగాయి. అధ్యాపకుల పర్యవేక్షణలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఈ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వీరేందర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కళాశాలలో చదువులతో పాటు ఆట పాటలు ఉంటాయని, విద్యార్థులు తమ తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తెరిగి బాధ్యాతాయుతంగా చదువుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కె.రజిత, వై.రేణుకాదేవి, జె.జ్యోతిర్మయి, ఎం.సంతోష్ కుమార్, పాగి అనిల్ కుమార్, ఎం.లక్ష్మణ్, జె. రవీంద్రనాయక్, బి.శ్రీనివాస్, ఎ.అనిత, పి.మధుకర్ రెడ్డి, ఎన్. వైష్ణవి పాల్గొన్నారు.

ఎవరా అధికారి?

'ఆంధ్రజ్యోతి' కథనంపై నిఘా వర్గాల ఆరా

మహదేవపూర్ రూరల్, నవం బరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర జ్యోతిలో 'పట్టుకున్నారు.. వదిలేశారు..' శీర్షికన మంగళవారం ప్రచురి తమైన కథనం తీవ్ర చర్చనీయాం శమైంది. కాటారం సబ్ డివిజన్‌లో పనిచేసే ఆ పోలీసు అధికారి ఎవరనే కోణంలో నిఘావర్గాలు ఆరాతీసినట్లు తెలిసిం ది. కోడిపందె లను నిర్వహిం చింది ఎక్కడ.. ఎప్పు డు పట్టుకున్నారు.. పట్టుకున్నది ఎవరు? అనే కోణంలో సమాచారం సేకరించినట్లు తెలిసింది. ఆ అధి కారి కిందున్న సిబ్బందిపైనా ప్రత్యే కంగా ఆరా తీసి నట్లు సమా చా రం. ఇటీవల అంతర్రాష్ట్ర వంతెనపై నుంచి బైక్‌పై నాటు సారాను తరలిస్తున్న ముగ్గురి నుంచి మా మూళ్లు తీసుకొని వదిలేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సం'పత్తి' దోపిడీ!

(3వ పేజీ తరువాయి)

వరంగా మారనుంది. ములుగు వెనుక బడిన జిల్లా కావడంతో ఇక్కడి రైతుల్లో ఎక్కువ మందిఇ చదువుకోని వారు ఉంటారు. కాస్తోకూస్తో చదువుకున్నప్పటికీ వారికి స్మార్ట్ ఫోన్ వాడకం ఎలాగో తెలియకపోవచ్చు. వారు పండించిన పత్తిని అమ్ముకునేందుకు తప్పని సరిగా కపాస్ కిసాన్ యాప్‌లో రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుంది. అయితే.. పెద్దగా చదువుకోని రైతులు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన యాప్‌లో ఎలా రిజిస్టర్ చేసుకోవాలో తెలియక తికమక పడుతుంటారు. ఇదే అదునుగా భావించిన దళారులు రైతుల వద్దకు వెళ్లి 'మీ వద్దనున్న పత్తిని మేము కొనుగోలు చేస్తాం అని, మీరు నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్తే ప్రభుత్వ నిబంధనల ప్రకారం తేమశాతం వస్తుందో రాదో' అని అపోహలు సృష్టిస్తున్నారని తెలుస్తోంది. దీంతో యాప్‌ల గోల తమకెందుకు అన్నట్టు రైతులు పత్తిని దళారులకే కట్టబెడుతున్నారని సమాచారం.

దళారులపై చర్యలు తీసుకుంటాం

- సోనియా, వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి

రైతుల వద్ద నుంచి దళారులు పత్తిని కొనుగోలు చేస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. ట్రేడ్ లైసెన్స్ కలిగి లేని వారెవరైనా రైతుల వద్ద నుంచి కొనుగోలు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటాం. రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ దళారులను నమ్మి మోసపోవద్దు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే విక్రయించాలి. కిసాన్ కపాస్ యాప్ వినియోగించరాని, స్మార్ట్ ఫోన్ లేని రైతులకు మండల వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉంటారు.

ఎస్‌జీఎఫ్ క్రీడలు ప్రారంభం

వెంకటాపూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలంపేట జడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో నిర్వహిస్తున్న 69వ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) క్రీడలను ఎస్సై చల్ల రాజు మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ ముందుండాలన్నారు. క్రీడాస్ఫూర్తి ద్వారా క్రమశిక్షణ,జట్టు భావన పెరుగుతుందని అన్నారు. అదేవిధంగా విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, తాము ఎంచుకున్న క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలని సూచించారు.

డాక్యుమెంట్ రైటర్ల జిల్లా అధ్యక్షుడి ఎన్నిక

ములుగు టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): డాక్యుమెంట్ రైటర్ల జిల్లా అధ్యక్షుడిగా సాధు రఘు ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఈ మేరకు ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్లు విశ్వనాథ్, ప్రవీణ్, హరినాథ్, భాస్కర్, రాజేందర్, రాజేష్, సుజాత, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

10న ఐటీఐ కళాశాలలో అప్రెంటిస్ మేళా

ఏటూరునాగారం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వ ఉపాధి, పారిశ్రామిక శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ములుగు జిల్లా ఏటూరునాగారం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈనెల 10న అప్రెంటీస్, యాప్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. s హైదరాబాద్ నుంచి వివిధ కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని, వివిధ ట్రేడ్‌లలో అనుభవం కలిగి, ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ మేళాకు హాజరుకావాలని సూచించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

వెంకటాపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు అన్నిరంగాల్లో రాణించాలని ఏసీఎంవో రవీందర్ అన్నారు. మంగళవారం మండలపరిధిలోని చిరుతపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో జరుగుతున్న డివిజన్‌స్థాయి క్రీడా పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా రవీందర్ మాట్లాడుతూ క్రీడలు స్నేహాభావాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని అన్నారు. క్రీడలు వ్యక్తిగత నైపుణ్యాలను వెలికితీస్తాయని పేర్కొన్నారు. కాగా, విద్యార్థులు వాలీబాల్, ఖో-ఖో, అథ్లెటిక్స్ పోటీల్లో చురుగ్గా పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక

వెంకటాపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మంగళవారం అధికారులు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులపై 17వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈసందర్భంగా మండలంలోని 18 గ్రామపంచాయతీల్లో జరిగిన పనులపై ప్రిసైడింగ్ అధికారి మెరుగు శ్రీనివాసరావు, అడిషనల్ డీఆర్‌డీవో కృపకరమ్, ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీవో భవాని సమక్షంలో పనులను వివరించారు. కాగా, 18పంచాయతీల్లో చేపట్టిన పనుల్లో ఏ పంచాయతీలో ఎంతమేరకు తప్పిదాలు జరిగాయి, ఎంతమేరకు రికవరీ చేయాలనే విషయాలను సామాజిక తనిఖీ బృందాలు అధికారులకు వివరించాయి. రూ.55వేల వరకు వివిధ పనుల్లో రికవరీ చేయాలని ఉపాధిహామీ సిబ్బంది, ఏపీవోను అధికారులు ఆదేశించారు. ఈకార్యక్రమంలో ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

యూడైస్ డేటాలో తప్పులు ఉండొద్దు

వాజేడు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం ఎంఈవో వెంకటేశ్వర్లు మండలంలో ఉన్న అన్ని యాజమాన్య పాఠశాలల హెచ్‌ఎంలో ఒరియెంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూడైస్ ప్లస్‌లో పాఠశాలలో ఉన్న మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా ఇవ్వాలన్నారు. ప్రతి విద్యార్థి వివరాలను యూడైస్ ప్లస్‌లో నమోదు చేయటం తప్పనిసరి అన్నారు. డీఎస్ఈ ఎఫ్ఆర్ఎస్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయుల హ ఆజరు 100శాతం నమోదు అయ్యే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం ఎస్. ఆనందరావు, స్ట్రాంగ్ టీచర్ జయేందర్‌రావు, సిబ్బంది నరేష్, సీఆర్‌పీలు వెంకటేశ్వర్లు, శ్రీను పాల్గొన్నారు.

హరీశ్‌రావును పరామర్శించిన మాలమహానాడు నాయకులు

మంగపేట నవంబరు 04 (ఆంధ్రజ్యోతి) పితృ వియోగంలో ఉన్న మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావును పరామర్శించినట్లు మాల మహానాడు రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు చిట్టిమల్ల సమ్మయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, ప్రధాన కార్యదర్శి బైరి రమేష్‌తో కలిసి హరీశ్‌రావు ఇంటికి వెళి ఆయన తండ్రి సత్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పించారు.

గ్రామాల్లో నాణ్యమైన విత్తన క్షేత్ర దినోత్సవం

వెంకటాపూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మండలంలోని ప్రతి గ్రామంలో నాణ్యమైన విత్తన క్షేత్ర దినోత్సవం నిర్వహించనున్నట్లు జిల్లా వ్యవసాయ నోడల్ అధికారి, వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ బొంతా విద్యాధర్ అన్నారు. ఇందులో భాగంగా మంగళవారం మండలంలోని పాలంపేట, లక్ష్మీదేవి పేట గ్రామాల్లో డబ్ల్యూజీఎల్-962 వరిరకంపై క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సరఫరా చేసిన వరి విత్తనాలను బహిరంగ మార్కెట్‌లో అమ్ముకోకుండా అదే గ్రామంలో రైతులకు విత్తనంగా వాడుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శైలజ, క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారులు సునీల్, దయాన, రైతులు మొగిలి, సత్యం, సారంగం, భిక్షపతి, ఓదెలు, సారంగపాణి పాల్గొన్నారు.

రేపు రహదారి మూసివేత

ములుగు రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జేడీ మల్లంపల్లి సమీపంలోని ఎస్సారెస్పీ కెనాల్ వద్ద జాతీయ రహదారి ఎన్‌హెచ్ 163 బ్రిడ్జి నిర్మాణం పనుల్లో భాగంగా గురువారం ఉదయం 5గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు జాతీయ రహదారిని తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు నేషనల్ హైవే ఏఈ చైతన్య మంగళవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ములుగు నుంచి హనుమకొండ వెళ్లే చిన్న వాహనాలు అబ్బాపూర్, భూపాల్‌నగర్ మీదుగా, భారీ వాహనాలు గుడెప్పాడ్, పరకాల మీదుగా వెళ్లాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

మహిళా రక్షణపై అవగాహన కలిగి ఉండాలి

ఏటూరునాగారం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మహిళా రక్షణపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని షీటీమ్ ఏటూరునాగారం సబ్ డివిజన్ ఇన్‌చార్జ్ సమ్మూలాల్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా రక్షణ కార్యక్రమాలపై విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈవ్ టీజింగ్, అత్యాచారాలు, సైబర్ క్రైమ్, యాంటీ ర్యాగింగ్ వంటి సమస్యలపై విద్యార్థినులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ వింగ్ రిసోర్స్ పర్సన్స్ మిరాజ్, స్వాతి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బి. రేణుక తదితరులు పాల్గొన్నారు.